పట్టువదలని విక్రముడు

ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గ ప్రగతి కోసం పట్టువదలని విక్రమార్కుడిలా చర్యలు తీసుకుంటున్నారు. సొంత నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆత్మకూరులో అధునాతన సౌకర్యాలతో బస్టాండ్ నిర్మిస్తున్నారు. జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రణాళికలు
- ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్) ఏర్పాటు
- రూ.2.87 కోట్ల సొంత నిధులతో బస్టాండ్ నిర్మాణం
- యువత కోసం జాబ్‌మేళాల నిర్వహణ
- స్కిల్స్‌పై నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ


శరవేగంగా జరుగుతున్న బస్టాండ్ నిర్మాణ పనులు

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయసాధనే లక్ష్యంగా ఆయన సోదరుడు, స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం(ఏడీఎఫ్), ఎంజీఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సోదరుడైన విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 80 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలోనే ఆయన ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులైనా వెచ్చించి ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నారు. తొలుత నియోజకవర్గ కేంద్రమైన ఆత్మకూరులో మున్సిపల్ బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.2.87 కోట్ల వ్యయంతో ప్రయాణికులకు సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణం చేపట్టడం విశేషం. మూడు నెలల వ్యవధిలోపే బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయనుండడం మరో విశేషం.



స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి(ఫైల్)


ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఏడీఎఫ్ ద్వారా ప్రణాళికలు

ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం(ఏడీఎఫ్) ఏర్పాటు చేసి తన సన్నిహితులతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలను ఇందులో కలుపుకొని వారి సహకారంతో అభివృద్ధి పనులు చేయించేందుకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి ఏడీఎఫ్ సమావేశం పలువురు ప్రముఖులతో ప్రత్యక్షంగా, విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారితో ఆన్‌లైన్ ద్వారా సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో పలు సూచనలు తీసుకొని అధికారులతో సమీక్షించి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇటీవల బస్టాండ్ నిర్మాణ పనులను నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి కుమార్తె, ఎంజీఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ అనన్యారెడ్డి ఎమ్మెల్యేతో కలిసి స్వయంగా పరిశీలించారు.


ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నమూనా చిత్రం

యువత భవిష్యత్ కోసం

జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా గతంలో సుమారు 32 కంపెనీలతో ఆత్మకూరులో జాబ్‌మేళా నిర్వహించారు. అనంతరం అక్టోబర్‌లో మరో జాబ్‌మేళా కూడా నిర్వహించారు. ఈ రెండుమార్లు నిర్వహించిన జాబ్ మేళాల్లో 350 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. అయితే ఈ జాబ్‌మేళాల నిర్వహణలో కొన్ని విషయాలు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దృష్టికి రావడంతో స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్యమైందని గుర్తించి 'వర్క్‌వెర్స్' సంస్థ సహకారంతో మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇటీవల స్వయంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, అనన్యారెడ్డిలతో కలిసి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలోనే మరో భారీ జాబ్ మేళా నిర్వహించేందుకు అత్యధిక కంపెనీలు పాల్గొనేలా ఏడీఎఫ్ తరఫున కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలపడం గమనార్హం. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి గతంలో మున్సిపల్ పరిధిలోని చెరువుకట్టను అభివృద్ధి చేసి అక్కడ వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి మున్సిపల్ ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఆ పనులు నిలిచి ఉన్న క్రమంలో త్వరలోనే పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. దీనికితోడు గత వారంలో నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం పలువురు ద్వితీయశ్రేణి పార్టీ నాయకులతో విజయవాడకు వెళ్లి పలు ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారి ఆమోదం పొందారు. దీంతో మరికొన్ని పనులు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి.

మంచి పరిణామం



ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు సొంత నిధులు వెచ్చించి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పనులు చేయించడం మంచి పరిణామం. అదే క్రమంలో ఆత్మకూరు అభివృద్ధిలో భాగంగా మేజర్ చెరువును అభివృద్ధి చేసి పిల్లల కోసం పార్కు, ప్రజల కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. దాని గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

– ఎం.రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

ఏడీఎఫ్‌తో సమగ్ర అభివృద్ధి



ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం(ఏడీఎఫ్) ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కుటుంబీకులు కృషి చేస్తున్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తొలి ఐదేళ్లలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోయినా అప్పట్లోనే సొంత నిధులతో పలు మండలాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు రైతుల కోసం సాగునీటి కాలువల్లో పూడికతీతకు యంత్రాలు ఏర్పాటు చేశారు. ఆయన ఆశయాలు నెరవేరేలా ఏడీఎఫ్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆత్మకూరు అభివృద్ధి త్వరలోనే సాకారం కానుంది.

– అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఆత్మకూరు

క్లుప్తంగా

నిత్యావసరాల వితరణ



కావలి: స్థానిక వెంగళరావునగర్‌లోని విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో నిరుపేదలకు సుమారు రూ.65 వేల విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం పేదలకు వితరణగా అందజేశారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, విట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ విద్యాధర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 65 మంది పేదలకు బియ్యం, సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ ఉమాచంద్, విశ్వోదయ సేవా సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ, అమరావతి, సతీష్‌సింగ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలిగిరి: మండలంలో సోమవారం ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థినికి అభినందన



ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చెన్నకేశవులు కుమార్తె లలిత నెల్లూరులోని వైద్య కళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమెను ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్లి ఆమెను అభినందించారు. ఆయన వెంట ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి మల్లికార్జున తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2022–2023 పంట కాలానికి వేలం సమయంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి సత్యశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీజనల్ క్లర్క్, కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీ లోపు పొగాకు బోర్డులో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

జనపనార సంచుల పంపిణీ



అనుమసముద్రంపేట: ఈఎంసీ చర్చి రాజవోలు వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులకు జనపనార సంచులను పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనపనార సంచులు వినియోగించాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు. ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా ఒకచోట సమావేశమయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. చిన్నచిన్న ఆటలు ఆడి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శివాజీ, మధుసూదన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, వినోద్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచెలో వెలసిన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా గంధ మహోత్సవం


గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న ముస్లింలు

సంగం: హజరత్ ఖాజాగరీబ్ నవాజ్ మొయినుద్దీన్ చిస్తీ రహమతుల్లా అలై అజ్మరీ గంధ మహోత్సవం సంగం మండలం దువ్వూరు గ్రామంలోని ఆస్థానా ఏ నూరియాలో హజరత్ షేక్ బాషాసాహెబ్ నూరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆస్థాన ఏ నూరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి..

సోమశిల: అనంతసాగరంలో హజరత్ సయ్యదినా యూసఫ్ ఆలీషా ఖాదరీ గంధ మహోత్సవం మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ మునీర్ ఆలీషా ఖాదరి ఆదివారం తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి రోజు గంధ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖవ్వాలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉరుసు, గురువారం తహలీల్ ఫాతేహా ఖానీ నిర్వహిస్తామని తెలిపారు.

గురుకులంలో వైద్యశిబిరం



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పూర్వవిద్యార్థి డాక్టర్ కొప్పుల తిరుపతి పర్యవేక్షణలో పాఠశాలలోని విద్యార్థులకు గొంతు, చర్మం, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.మురళీకృష్ణ, రసూల్, సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని పలకరించండి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచన


పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు

అల్లూరు: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్లనే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించగలుగుతున్నాయని తెలిపారు. రాబోయే 14 నెలల కాలం ఎంతో విలువైనదని, వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పనిచేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మార్చి 18వ తేదీ నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు సేకరించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారికి కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, ఎల్లోమీడియా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలు గెలుపొందేలా గృహసారథులు పనిచేయబోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేట పంచాయతీలను నగర పంచాయతీగా వద్దని, గతంలో లాగే పంచాయతీగా ఉంచాలని నాయకులు ఎమ్మెల్యేని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, కావలి ఏఎంసీ చైర్మన్ ప్రసాద్‌యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, వైస్ ఎంపీపీ సురేంద్ర, వాసు, నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా కృష్ణారెడ్డి, షేక్ ఉస్మాన్, సామంతుల సురేష్‌రెడ్డి, దైవాదీనం, దాసరి పోలయ్య, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

తిరుమల: తిరుమలలోని పాపవినాశనం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి వెలుగుచూసింది. తిరుమల టూటౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు వింజమూరు మండలానికి చెందిన కొల్లెం సుబ్బారెడ్డి(85) అన్నమయ్య మార్గంలోని అటవీ ప్రాంతంలో మృతిచెంది ఉన్నట్లు టీటీడీ అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న తిరుమల టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతని ఆధార్‌కార్డు ఆధారంగా అతని చిరునామాను గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నెల క్రితం వృద్ధుడి రెండో కుమారుడు మృతిచెందాడని, దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన వృద్ధుడు తిరుమలకు చేరుకున్నట్లు తెలిపారు. గుండు చేయించుకున్న వృద్ధుడు అటవీ ప్రాంతంలోకి ఎందుకు వెళ్లాడు.. అక్కడ జారి పడి గాయపడ్డాడా.. లేకా ఏమైనా జరిగిందా.. అనే విషయంపై దర్యాప్తు జరపాల్సి ఉందని సీఐ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసును నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ప్రభుత్వ రుయా ఆస్పత్రికి తరలించారు.

ఆటో అదుపుతప్పి పడిపోయి..

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం సమీపంలో ఆదివారం ఆటో అదుపుతప్పి పడిపోయి ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తూరుకు చెందిన కొందరు శనివారం మహాశివరాత్రి సందర్భంగా ఆటోలో బయలుదేరి సిద్ధేశ్వరానికి వెళ్లారు. దైవ దర్శనం చేసుకొని ఆదివారం ఉదయం పెద్దిరెడ్డిపల్లిలోని శివాలయంలో పూజలు చేసి స్వగ్రామానికి బయలుదేరారు. గండిపాళెం సమీపంలో ఆటోకు కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న సుజిత్, సిద్దూలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఉదయగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుజిత్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

కమనీయం.. కల్యాణం


అనుమసముద్రంపేట: చిరమనలో కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవ దృశ్యం

సంగం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం అర్ధరాత్రి స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షిదేవి – సంగమేశ్వరస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై కొలువుదీర్చారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించగా భక్తులు వీక్షించారు. అనంతరంలో ఆలయంలో లింగోద్భవ కాల పూజలు నిర్వహించారు. అలాగే లింగోద్భవ సమయంలో తిరుమనకొండపై వెలసిన కాశీవిశ్వేశ్వరునికి గోక్షీరంతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అదేవిధంగా దువ్వూరులో కోటేశ్వరస్వామి, వంగల్లులో భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రాజవోలులో..

అనుమసముద్రంపేట: మహాశివరాత్రి సందర్భంగా శనివారం అర్ధరాత్రి మండలంలోని రాజవోలు గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు చిట్టమూరు వెంకటరెడ్డి – సుగుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు


కొత్తపల్లిలో పంటకోత ప్రయోగం చేస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

కావలి: రైతులు పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం కోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో స్థానిక రైతు మాల్యాద్రి పండిస్తున్న వరిపంటను ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది ఆదివారం పరిశీలించారు. వరిపంట కోతకు సిద్ధంగా ఉండడంతో పంటకోత ప్రయోగం నిర్వహించి దిగుబడిని అంచనా వేశారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించిన పొలం కన్నా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పొలంలోనే అధిక దిగుబడి వస్తున్నట్లు గుర్తించి స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భూమిని సహజ పద్ధతిలో సారవంతం చేయడంతో పాటు చీడపీడలు తట్టుకునేలా పంటలకు సహజ రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. దీంతో పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది కళావతి, పున్నారావు, శ్రీహరి, శ్రీను, రమేష్, పురుషోత్తం, లక్ష్మి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు జూనియర్ స్థాయి, 6, 7, 8 తరగతుల వారికి సీనియర్ స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని బొగ్గేరు వద్ద ఉన్న కాశీనాయన ఆశ్రమం ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మండలంలోని, పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఉక్తలేఖనం, అభినయంతో కథ చెప్పడం, కంఠస్త పద్యాలు, క్విజ్ పోటీలు, మంచి దస్తూరి తదితర అంశాల గురించి ఈ పోటీలు నిర్వహించనునున్నట్లు తెలిపారు. విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పందుల స్వైర విహారం


రోడ్డుపై స్వైరవిహారం చేస్తున్న పందులు

అల్లూరు: నగర పంచాయతీ అల్లూరులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందుల పెంపకందారులు పగలు, రాత్రి అని తేడా లేకుండా వాటిని విడిచిపెట్టడంతో గుంపులుగా వీధుల్లో తిరుగుతున్నాయి. వీధుల్లో ఇప్పటికే కుక్కల బెడదతో బెంబేలెత్తున్న ప్రజలు పందుల సంచారం వల్ల మరిన్ని అవస్థలు పడుతున్నారు. పందులు ఇళ్లల్లోకి చొరబడి రచ్చరచ్చ చేస్తున్నాయి. నగర పంచాయతీ శివారులోని బీసీకాలనీ, రజకకాలనీ, ఆర్డీఆర్ కాలనీ, కోనేటిమిట్ట, మసీద్ సెంటర్, వడ్డిపాళెం, వినాయకనగర్, శంభునివీధి, తూర్పువీధి, కట్టకింద అరుధంతీయవాడ, పోలీస్‌లైన్ తదితర ప్రాంతాల్లో పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. గతంలో పలుమార్లు పందుల పెంపకందారులను అధికారులు హెచ్చరించినా వారు కొద్దిరోజులు మాత్రమే వాటిని కట్టడి చేసి మళ్లీ యథావిధిగా వదిలేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ స్పందిస్తూ గతంలో పలుమార్లు పందుల పెంపకదారులకు హెచ్చరించామని, అప్పట్లో వారు వాటిని కట్టడి చేసి మళ్లీ వదిలేశారని తమ దృష్టికి వచ్చిందని, వారిని మరోమారు పిలిచి హెచ్చరిస్తామని తెలిపారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి


శివాజీ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి తదితరులు

వింజమూరు: స్థానిక పాతబస్టాండ్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ సామ్రాజ్య స్థాపనకు శివాజీ చేసిన కృషిని కొనియాడారు. ర్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్, సర్పంచ్ ఎస్.సృజన, మద్దూరి రాజగోపాల్‌రెడ్డి, డేగా మధుయాదవ్, నీలం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.